ఆగిన డెత్ సర్టిఫికెట్.. అందని బీమా

- *25 రోజులైనా చేతికందని ధ్రువీకరణ పత్రం*
- *రైతుబీమా కోసం అనాథ చిన్నారి ఎదురుచూపులు*

అనాథగా మారిన అర్పిత

గంభీరావుపేట, మార్చి 21: ఇప్పటికే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ చిన్నారికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు బీమా అందుకోవడంలో మరింత జాప్యమవుతున్నది. తండ్రి మరణించి 25 రోజులైనా మరణ ధ్రువీకరణ పత్రం అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కోళ్లమద్దికి చెందిన ఎనిమిదేండ్ల జాలిగం అర్పిత పుట్టిన కొద్ది రోజులకే తల్లి మరణించగా, గత నెల 26న తండ్రి శంకర్ అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆ చిన్నారి అనాథగా మారింది. తండ్రి పేరిట ఎకరం వ్యవసాయ భూమి ఉండగా, రూ.5 లక్షల రైతు బీమా మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు అర్పితకు సూచించారు. మాజీ సర్పంచ్ కేశవరావు చొరవ తీసుకుని గత నెల 27న మరణ ధ్రువీకరణ పత్రం కోసం పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. 25 రోజులైనా మరణ ధ్రువీకరణ పత్రం చేతికి రాకపోవడంతో చిన్నారి అర్పితకు రైతు బీమా మంజూరు కావడంలో జాప్యం జరుగుతున్నది. డెత్ సర్టిఫికెట్ ఇస్తేనే బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీంతో చిన్నారి దిక్కుతోచని స్థితిలో పడగా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు మాజీ సర్పంచ్ తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా డిజిటల్ సైన్ కావడంలో ఇబ్బంది తలెత్తడం వల్లే ఆలస్యమవుతున్నదని తెలిపారు.

రైతుకు తప్పని పాట్లు

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి శివారులోని బొత్తల తండాలో నాణ్యమైన కరెంట్ సరఫరా లేక రైతు జాటోత్ సోమాని విద్యుత్తు మోటర్ కాలిపోయింది. చేతిలో డబ్బులు లేక పది రోజులు మెకానిక్ వద్దే ఉందని, అప్పు చేసి మోటర్‌ను మరమ్మతు చేసి కావడితో మోటర్‌ను తీసుకొస్తుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది. - పెద్దవంగర

కౌలు రైతు ఆత్మహత్య

- *దిగుబడి రాక, అప్పులు తీర్చలేక ఉరి వేసుకొని బలవన్మరణం*
- *హనుమకొండ జిల్లా ఐనవోలులో విషాదం*

బరిగెల ప్రశాంత్ (ఫైల్)

ఐనవోలు, మార్చి 21: అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన బరిగెల ప్రశాంత్ (28) ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. 4 ఎకరాల్లో పత్తి, 3 ఎకరాల్లో మిరప సాగు చేశాడు. రెండు మూడేండ్ల నుంచి పంట పెట్టుబడికి కలిపి సుమారు రూ.10 లక్షలు అప్పులయ్యాయి. వాతావరణం అనుకూలించక పంట దిగుబడి సరిగా రాకపోవడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి అందక మనస్తాపానికి గురయ్యాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. భార్య అనూష, తల్లి సౌందర్య కూలి పని చేసి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తలుపులు పెట్టి ఉన్నాయి. గ్రామస్థుల సాయంతో ఇంటి తలుపులు పగులగొట్టి వేలాడుతున్న ప్రశాంత్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 9 గంటలకు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడాది వయస్సు బాబు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

నీటి కోసం అన్నదాతల అరిగోస

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం మానేరు వాగు, చలి వాగుల్లో నీరు ఎండిపోవడంతో సమీప రైతులు చేతికొచ్చే దశలో ఉన్న తమ పంటలను కాపాడుకోవడానికి అరిగోస పడుతున్నారు. వాగులోని నీరు అడుగంటడంతో అప్పులు చేసి చేతి బోర్లు వేస్తున్నారు. ఎంత లోతుకు వేసినా నీరు అందడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు చెరువు కింద ఈ ఏడాది వరి పంట వేయకుండానే వదిలేశారు. - టేకుమట్ల

పంటలకు నీళ్లు కష్టమే

- *తాగునీటి కోసమే తండ్లాడుతున్నాం*
- *కర్ణాటక నుంచి నీళ్లడిగే పరిస్థితి లేదు*
- *ఎంవిఎంతో స్నేహం కొనసాగిస్తాం*
- *ముఖ్యమంత్రి పదవిపై ఆశలేదు*
- *మంత్రి పొంగులేటి చిట్‌చాట్*

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): రాబోయే సీజన్‌లో వ్యవసాయానికి నీళ్లు అందించడం కష్టమేనని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో నీటి కొరత ఉన్నదని, ప్రజలకు తాగునీరు అందించడానికే కష్టపడుతున్నామని చెప్పారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. కర్ణాటకలోనూ కరువు నెలకొన్నదని, కాబట్టి ఆ రాష్ట్రాన్ని కూడా అడిగే పరిస్థితి లేదని స్పష్టంచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నప్పటికీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆలస్యం అవుతున్నదని, నెలల బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఈ విషయంపై దృష్టిసారించాం తమతో స్నేహం చేసేందుకు ఎంఐఎం ముందుకొస్తున్నదని వెల్లడించారు. తమ స్నేహం కొనసాగుతుందని, హైదరాబాద్‌లో నామమాత్రంగా అభ్యర్థిని నిలబెడతామని చెప్పారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి రమ్మని ఎవరినీ అడగడం లేదని, వారే స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌పై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని తెలిపారు. ధరణిలో మంచిని కొనసాగిస్తామని స్పష్టంచేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్రంతో కొట్లాడుతూనే ఉంటామని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలపై కార్యాచరణ మొదలైందని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన నెల రోజుల్లో జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీ సభ్యులకు ప్లాట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

నీళ్లిస్తమంటేనే పంటలేసిండ్రు

- *రైతును నట్టేటముంచుతున్న సర్కార్*
- *ఇచ్చిన మాట తప్పిన రేవంత్‌రెడ్డి*
- *మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి*

సూర్యాపేట మండలం దుబ్బతండాలో ఎండిన వరి పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం సాగుకు నీళ్లిస్తామని హామీ ఇవ్వడం వల్లే రైతులు పంటలు వేశారని, ఇచ్చిన మాటకు కట్టుబడకుండా మోసం చేసి రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఎండిపోతున్న పంటలను పరిశీలిస్తున్న ఆయన ఐదో రోజైన గురువారం సూర్యాపేట మండలం యర్కారం, దుబ్బతండా, రేఖ్యానాయక్‌తండాల్లో ఎండిన పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మొన్నటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో కళకళలాడిన పంట పొలాలు నేడు మోడువారడానికి కారణం నూటికి నూరు శాతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని దుయ్యబట్టారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేస్తే మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ ఫేజ్-2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే పంటలు వేశారని, హామీ ఇచ్చి పంటలకు నీరు ఇవ్వకుండా రైతాంగాన్ని కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నమ్మి ఒక్కో రైతు ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల పెట్టుబడి పెట్టి ఆగమయ్యారని తెలిపారు. కాళేశ్వరం నీళ్లు ఎత్తి పోయడానికి కుంగిన మూడు పిల్లర్లకు సంబంధం లేకపోయినప్పటికీ కేవలం గత ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే రైతాంగానికి నీళ్లు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో రైతు తప్పిదంతో ఒక్క మడి ఎండిపోతేనే నానా హంగామా చేసిన ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. ఇప్పుడు ఎండిపోతున్న పొలాలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతూ రైతులు రోడ్డున పడుతుంటే మంత్రులు కనీసం సమీక్ష చేయకపోవడం.. రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని పేర్కొన్నారు.

ఎకరాకు రూ. 20 వేలు చెల్లించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల దాదాపు 2 లక్షల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నదని చెప్పారు. ఏడాదిలోనే మూడుసార్లు కురిసిన అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. వానాకాలంలో 12 లక్షల ఎకరాల్లో, యాసంగిలో మిచాంగ్ తుఫాన్ వల్ల 4.70 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తమ్మినేని గుర్తుచేశారు. మార్కెట్‌కు వచ్చిన ధాన్యం కూడా తడిసిపోయిందని, తక్షణమే నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం చెల్లించి, రుణమాఫీని ప్రకటించాలని తమ్మినేని కోరారు.

మద్నూర్‌లో స్వల్ప భూకంపం

మద్నూర్, మార్చి 21: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో గురువారం తెల్లవారుజామున స్వల్పంగా భూమి కంపించింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హింగోలి వద్ద భూకంప కేంద్రం నమోదు కాగా, దీని ప్రభావం కామారెడ్డి జిల్లా మద్నూర్ వరకు కనిపించింది. రిక్టర్ స్కేలుపై 3.6 తీవ్రత కన్పించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రకటించింది. తెల్లవారుజామున ప్రకంపనలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

మాంసాహారంలో యాంటిబయోటిక్స్

- *చేపలు, గొర్రెలు, మేకల్లో పెరిగిపోతున్న మల్టీడ్రగ్ రెసిస్టెన్స్*
- *ఐకార్-ఎఫ్ఏవో అధ్యయనంలో ఆందోళనకర విషయాలు*



హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): మాంసాహార ప్రియులు హడలిపోయే విషయాన్ని ఐకార్, ఎఫ్ఏవో అధ్యయనం బయటపెట్టింది. మేకలు, చేపలు, గొర్రెలు, రొయ్యలు, కోళ్లన్న తేడా లేకుండా అన్నింటి పెంపకంలోనూ యాంటిబయోటిక్స్ విని యోగం పెరిగిపోతున్నదని, దీంతో వాటిలో మల్టీడ్రగ్ రెసిస్టెన్స్ (నిరోధకత) ఎక్కువైపోతున్నదని వెల్లడైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐకార్), ఐక్యరాజ్య సమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో) కలిసి తెలంగాణ, ఏపీ సహా 10 రాష్ట్రాల నుంచి 2019-2022ల మధ్య కాలంలో పలు నమూనాలను సేకరించాయి. ఆయా నమూనాలలో ఈ-కొలి, స్టఫైలోకోకస్, ఏరోమోనస్, విబ్రియో వంటి వివిధ రకాల బ్యాక్టీరియా ఆనవాళ్లపై పరిశోధనలు జరిపాయి. ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలు, చేపలు, రొయ్యలు, కోళ్లు, పందుల నుంచి సేకరించిన శాంపిళ్లలో యాంటిబయోటిక్స్ రెసిస్టెన్స్ టెస్ట్‌లు చేశాయి. వీటిలో బర్రెలు, ఆవులు తప్ప మిగితావన్నీ మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్‌ను సంతరించుకుంటున్నాయని.. వాటిలో యాంటిబయోటిక్స్ అవశేషాలు ఎక్కువగా ఉన్నాయని వాటి అధ్యయనం తేల్చింది. ముఖ్యంగా మనం వాడే పెన్సిలిన్‌కు అధికంగా 70 నుంచి 90 శాతం వరకు ఇప్పటికే వాటికి నిరోధకత వచ్చిందని అవి పేర్కొన్నాయి. ఎరిత్రోమైసిన్, సెఫోటాక్సిమ్, మెరోపినమ్, సిప్రోఫ్లోక్సాసిస్, సెఫాక్సిటిన్, సెఫ్పోడాక్సిమ్, అమికాసిన్ వంటి వాటికి ఎక్కువ మొత్తంలో నిరోధకతను సంతరించుకున్నాయని తెలిపాయి.

కోళ్ల పెంపకంలో యాంటిబయోటిక్స్ వాడకం ఎక్కువగా ఉండటం వల్ల, వాటిలో నిరోధకత పెరుగుతున్నట్లు హెచ్చరించింది. మేకల్లో సెఫోటాక్సిమ్ రెసిస్టెన్స్ 41 శాతం ఉండగా, అమికాసిన్ 35 శాతం, యాంపిసిలిన్ 26 శాతం దాకా నిరోధకత పెరుగుతున్నట్లు అధ్యయనం తేల్చింది. అవుల్లో, బర్రెల్లో యాంటిబయోటిక్స్ రెసిస్టెన్స్ తక్కువగా ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. ఆవులు, బర్రెలు ఇచ్చే పాలపైనా యాంటిబయటిక్స్ టెస్ట్ చేశారు.

కార్టూనిస్టు మృత్యుంజయకు కీర్తి పురస్కారం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశేషమైన సేవలు అందించిన ప్రముఖులను కీర్తి పురస్కారాలతో సత్కరిస్తున్నది. 2022 సంవత్సరానికిగాను 46 మందికి పురస్కారాలు అందజేసింది. కార్టూనిస్టు విభాగంలో నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయను కూడా సత్కరించింది.

విమాన ప్రయాణికులే టార్గెట్!

- *భయపెట్టి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు*
- *అప్రమత్తంగా ఉండాలన్న పోలీసులు*

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): గోవా విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వచ్చేందుకు ఫ్లైట్ కోసం సూర్య వేచిచూస్తున్నాడు. గంటలో విమానం ఎక్కాల్సి ఉండగా ఫోన్ వచ్చింది. 'సర్.. మేము ముంబైలోని ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ పార్సిల్ రిటర్న్ అయ్యింది.. అందులో ఏదో అనుమానాస్పద వస్తువు ఉందేమోనని ముంబై పోలీసులకు సమాచారం ఇచ్చాం. వాళ్లు కేసు నమోదు చేశారు. మీతో ఎస్ఐ మాట్లాడుతారట' అని చెప్పి ఫోన్ పెట్టేశారు. తర్వాత మళ్లీ ఇంకో వ్యక్తి ఫోన్ చేసి హలో.. నేను ఎస్ఐని మాట్లాడుతున్నాను.. మీ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి.. మీ ఆధార్ నంబర్ ఎంత.. అడ్రస్ ఎక్కడ.. అని అడిగాడు. ఇదంతా విన్న సూర్య అమ్మో ఇదేదో సైబర్ మోసంలా ఉన్నదని గ్రహించి నాది హైదరాబాద్.. కేసు నమోదైతే హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ చేయండి.. ఆధార్ నంబర్, అడ్రస్ చెప్పను అని కరాఖండిగా చెప్పేశాడు. అనంతరం హైదరాబాద్ చేరుకున్నాక సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇది సైబర్ నేరగాళ్ల పనే అని గుర్తించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఫెడెక్స్ తరహా మోసాలు బాగా పెరిగిపోయాయని పోలీసులు చెప్పారు. ముఖ్యంగా విమానప్రయాణికులే లక్ష్యంగా ఈ మోసాలు జరుగుతున్నాయని వెల్లడించారు. విమాన ప్రయాణికులు తమ ప్రయాణ వివరాలను సోషల్ మీడియాలో పెడుతుండటంతో సైబర్ నేరాగాళ్లు ఫోన్లు చేసి ఈ తరహా మోసాలకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

పెరుగుతున్న నేరాలు

ఫెడెక్స్‌లాంటి నేరాలకు సంబంధించి 2022లో 64 కేసులు నమోదు కాగా.. 2023లో 645 కేసులు నమోదయ్యాయి. 2022 నుంచి 2024 జనవరి వరకు నమోదైన అన్ని కేసుల్లో నేరగాళ్లు రూ.18 కోట్లకుపైగా దోచుకున్నారు. ఇలాంటి నేరాల పట్ల విమాన ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి.

-తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఏడీజీ శిఖాగోయెల్

గుట్టలో బేబీ ఫీడింగ్ సెంటర్



యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు సౌకర్యాలపై దేవస్థానం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దైవ దర్శనానికి వచ్చే తల్లులు తమ బిడ్డలకు పాలిచ్చేందుకు ఇబ్బందులు పడకుండా 'మాతృమూర్తులకు వందనం' పేరుతో ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రధానాలయ ముఖ మండపంలోని హుండీ పక్కనే చిన్నారులకు పాలిచ్చేందుకు ఏర్పాటు చేసిన గదిని బుధవారం సీఎస్ శాంతికుమారి ప్రారంభించగా గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. - యాదగిరిగుట్ట

అమ్మో.. 'డీఎంఈ'!

పదవిపై వైద్యాధికారుల్లో విముఖత
దృఢ నిర్ణయం తీసుకోలేకపోతున్న ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో ఇప్పుడు 'డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్' (డీఎంఈ) పోస్టు అంటేనే అధికారులు ఉలిక్కి పడుతున్నారు. వైద్యవిద్యకు పెద్దదిక్కుగా నిలవాల్సిన పదవి తీవ్ర వివాదాస్పదంగా మారడమే ఇందుకు కారణం. కచ్చితమైన నిర్ణయం తీసుకోలేని ప్రభుత్వ అసమర్థత కారణంగా అటు కోర్టులో ప్రతిసారి చుక్కెదురు కావడంతోపాటు ఇటు తరుచూ అధికారులను మార్చాల్సి వస్తున్నది. తాజాగా ఇంఛార్జి డీఎంఈగా వాణిని నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను హైకోర్టు సస్పెండ్ చేసింది. దీంతో మరో కొత్త డీఎంఈని నియమించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం గత మూడు నెలల్లో ఇద్దరు డీఎంఈలను మార్చింది. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై తీవ్ర ప్రభావం పడుతున్నదని వైద్యవర్గాలు వాపోతున్నాయి. సీనియార్టీ ప్రకారం మొదటి స్థానంలో ఉన్న వ్యక్తిని డీఎంఈగా నియమించాలని గతంలో కోర్టు సూచించింది. అయితే ఆ పదవి కేవలం సీనియార్టీ ఆధారంగా ఇస్తే సరిపోదని, సమర్థతను కూడా చూడాలన్నది నిపుణుల అభిప్రాయం. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు గణనీయంగా పెరిగిపోవడంతో ఎన్ఎంసీ నిబంధనల మేరకు వాటి నిర్వహణ కత్తిమీద సాములా మారింది. మరోవైపు ప్రభుత్వం కొత్త కాలేజీలను కూడా ప్రకటించింది. ఇలా కాలేజీలు, అనుబంధ దవాఖానల ఏర్పాటు, సిబ్బంది నియామకం, నిర్వహణ, ఎన్ఎంసీతో సమన్వయం.. ఇలా డీఎంఈ అనేక విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఏ మాత్రం పొరపాటు చేసినా వేల మంది విద్యార్థుల జీవితాలు ఆగమవుతాయి. అందుకే సమర్థులైన అధికారులను నియమించాలని గత ప్రభుత్వం భావించింది. దీంతో రమేశ్‌రెడ్డిని ఇంచార్జి డీఎంఈగా కొనసాగించింది. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ దిశగా వేగంగా అడుగులు వేసింది. 2014లో రాష్ట్రంలో ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. 2023-24 నాటికి 26కు పెరిగాయి. అంటే తొమ్మిదేండ్లలోనే 21 కాలేజీలకు అనుమతులు వచ్చాయి. మరో 9 కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. తద్వారా జిల్లాకో మెడికల్ కాలేజీ దాదాపు పూర్తయింది. ఈ క్రమంలో డీఎంఈ పోస్టుపై న్యాయపరంగా అనేక సవాళ్లు ఎదురైనా ప్రభుత్వం సమర్థంగా సమాధానం ఇచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దృఢ నిర్ణయం తీసుకోవడంలో విఫలమైంది. సీనియార్టీ ప్రకారం మొదట అర్హత ఉన్నవారికి పదవిని అప్పగించడమా లేక తమకు నచ్చిన వ్యక్తికి బాధ్యత అప్పగించి కోర్టుకు సమాధానం చెప్పుకోవడమా.. ఈ రెండు దారులు మాత్రమే ప్రభుత్వం ముందున్నాయి. కానీ ప్రభుత్వం దేనినీ ఎంచుకోవడంలేదు. ఎన్నికలు, ఆ తర్వాత ఇంచార్జి డీఎంఈ రమేశ్‌రెడ్డి రాజీనామాతో ఐదారు నెలలుగా వందల ఫైళ్లు పెండింగ్ పడ్డాయి. ప్రభుత్వం ముందుగా డాక్టర్ త్రివేణికి ఇంఛార్జీ బాధ్యతలు అప్పగించింది. నెల రోజులు గడువకుండానే.. కోర్టుకు సమాధానం ఇచ్చుకోలేక ఆమెను తప్పించి, డాక్టర్ వాణికి ఇంచార్జీ బాధ్యతలు అప్పగించారు. సరిగ్గా నెల రోజుల తర్వాత బుధవారం కోర్టు ఆమె నియామకాన్ని కొట్టివేసింది. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఓవైపు పెండింగ్ ఫైళ్లు పూర్తిగా క్లియర్ కాలేదు. మరోవైపు మెడికల్ కాలేజీలకు గుర్తింపు గండం ముంచుకొస్తున్నది. ఇప్పటికే ఎన్ఎంసీ తనిఖీలు మొదలయ్యాయి. ఇప్పటికే నడుస్తున్న కాలేజీల అనుమతులను కాపాడుకోవడంతోపాటు కొత్త కాలేజీలకు అనుమతులు సాధించాల్సి ఉన్నది. డీఎంఈ లేకుండా ఈ ప్రక్రియ నిర్వహించడం అసాధ్యం. ప్రభుత్వం వెంటనే ఏదో ఒక నిర్ణయం తీసుకొని డీఎంఈని నియమించకపోతే కాలేజీల గుర్తింపు రద్దయ్యే ప్రమాదం పొంచి ఉన్నది. ఇంచార్జి అంటేనే అధికారులు జంకుతున్న నేపథ్యంలో రెగ్యులర్ డీఎంఈని నియమించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

వ్యవసాయ పరిశోధనలు రైతుల దరిచేరాలి

- *జయశంకర్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ సుధారాణి*

నల్లగొండ, మార్చి 21 : విశ్వవిద్యాయాల్లో చేస్తున్న పరిశోధనలు రైతులకు చేరేలా ప్రతి శాస్త్రవేత్త కృషి చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ డైరెక్టర్ సుధారాణి అన్నారు. నల్లగొండ కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో దక్షిణ తెలంగాణ వ్యవసాయాధికారుల సలహా మండలి ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించే సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు పూర్తి చేసిన తర్వాత సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పరిశోధనా ఫలితాలు ప్రతి రైతుకూ అందినప్పుడే ఉపయోగం ఉంటుందని తెలిపారు. శాస్త్రవేత్తలు, విస్తరణాధికారులు మమేకమై వ్యవసాయ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పప్పు దినుసులు, నూనె గింజల పంటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తుందని, రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహ పరిశోధన డైరెక్టర్ మల్లారెడ్డి, నల్లగొండ వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, శాస్త్రవేత్తలు భరత్‌భూషణ్, అనిల్ కుమార్, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, సుల్తాన్, శ్రీనివాస్, ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మూడోసారీ ఆడబిడ్డే.. చేన్లో పడేసిన తల్లి

మంచిర్యాల జిల్లాలో విషాదకర ఘటన

కన్నెపల్లి, మార్చి 21 : మగబిడ్డ కావాలని ఎదురు చూసిన ఓ మహిళకు మూడోసారీ ఆడబిడ్డే పుట్టడంతో గ్రామ శివారులో పడేసింది. విషాదకరమైన ఈ ఘటన మంచిర్యాల జిల్లా భీమిని మండలం కేస్లాపూర్‌లో చోటుచేసుకున్నది. కేస్లాపూర్‌కు చెందిన గంగక్కకు ఇద్దరు కూతుళ్లుండగా, పెద్ద కూతురికి వివాహమైంది. రెండో కూతురు పెళ్లీడుకొచ్చింది. మగ శిశువు కోసం ఎదురుచూసి మరోసారి గర్భందాల్చింది. బుధవారం రాత్రి మూడోకాన్పులోనూ ఆడ శిశువు జన్మించడంతో తీవ్ర ఆవేదనకు గురైంది. పెండ్లయిన కూతురుండగా, మళ్లీ గర్భం దాల్చడం అవమానకరంగా భావించి.. అప్పుడే పుట్టిన శిశువును గ్రామ శివారులోని చేలల్లో పడేసి ఉంటుందని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. గురువారం శిశువు మృతదేహాన్ని కుక్కలు గ్రామం దగ్గరికి లాక్కొని రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విజయ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విచారణ నిమిత్తం గంగక్కను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.